సాక్షి
కృష్ణాజిల్లా
శుక్రవారం । 22 । నవంబర్ । 2024



ముగిసిన వారోత్సవాలు

విజయవాడ కల్చరల్ : విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి.



నయనపర్వం శ్రీకృష్ణ పారిజాతం

కూచిపూడి(మొవ్వ): ప్రముఖ నాట్యక్షేత్రం కూచిపూడిలో గురువారం ప్రదర్శించిన శ్రీకృష్ణ పారిజాతం కూచిపూడి నృత్యరూపకం నయన పర్వంగా సాగింది.

వైవీకి ఉమ్మడి కృష్ణాజిల్లా బాధ్యతలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ఉమ్మడి గుంటూరు జిల్లా రీజినల్ కోఆర్డినేటర్‌గా ఉన్న డాక్టర్ వైవీ సుబ్బారెడ్డికి ఉమ్మడి కృష్ణాజిల్లా బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

న్యూస్‌రీల్

నేటి నుంచి హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ మేరీస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నుంచి లేపాక్షి గాంధీ శిల్ప బజార్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ వీసీ, ఎండీ ఎం.విశ్వ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ శిల్పబజార్‌లో డిసెంబర్ ఒకటో తేదీ వరకు హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ ప్రదర్శనను రాష్ట్రమంత్రులు ఎస్.సవిత, సత్యకుమార్ యాదవ్ ప్రారంభిస్తారన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 100మంది హస్తకళాకారులు తమ కళానైపుణ్యంతో తయారుచేసిన ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచుతారన్నారు. టెక్స్‌టైల్స్, ఎంబ్రాయిడరీ, గ్రాస్ లీఫ్, ఇమిటేషన్ జువెలరీ, కార్పెట్స్, లెదర్ ఆర్టికల్స్, హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్, టై అండ్ డై చీరలు, ఉడ్ కార్వింగ్, లేస్ బ్యాగులు, డ్రెస్ మెటీరియల్స్, కొండపల్లి బొమ్మలు, బాటిక్ ప్రింట్స్ వంటి ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని విశ్వ వివరించారు.

డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలంటూ ధర్నా




అవనిగడ్డ: ప్రభుత్వం వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం కృష్ణాజిల్లా అవనిగడ్డలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. నవంబర్ మూడో తేదీన నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్టు చెప్పిన ప్రభుత్వం తరువాత ఆరోతేదీ అని చెప్పి, చివరికి నోటిఫికేషన్‌ను వాయిదా వేసి నిరుద్యోగులను వంచనకు గురి చేసిందన్నారు. అధికారం చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ ఫైల్‌పై మొదటి సంతకం అంటూ హడావుడి చేసిన చంద్రబాబు ఇంతవరకూ నోటిఫికేషన్ ఎందుకు ప్రకటించలేదని విమర్శించారు. టెట్ తరువాత మూడు నెలల కాల పరిమితి ఉండాలనే సాకుతో కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌కు కాలయాపన చేస్తోందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో 6,100 పోస్టులతో డీఎస్సీ ప్రకటించగా, ఆ పోస్టులను కూడా కలుపుకుని 16,347 పోస్టుల్ని ప్రకటించి ఐదు నెలలు అవుతున్నా ఇంతవరకూ తేదీలు ఇవ్వకుండా నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం దగా చేస్తోందన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రస్తావనే లేకపోవడం చూస్తుంటే, డీఎస్సీ అంశంపై కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్‌ని విడుదల చేయాలని రవిచంద్ర డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు ఐ.శ్రీనివాస్, కె.శివారెడ్డితోపాటు డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

ఫీజు.. పరేషాన్

పేదల చదువులు ప్రమాదంలో పడ్డాయి...ఐదేళ్లుగా నిరాటంకంగా సాగిన పేదల చదువులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి... పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంజినీరింగ్, డిగ్రీ చదువుతున్న పేద విద్యార్థులకు నేటివరకు ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు విడుదలగాక పోవడమే ఇందుకు ప్రధానకారణం. ఫీజుల కోసం కళాశాలలు ఒత్తిడి చేస్తుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్న వైనంపై ప్రత్యేక కథనం.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నేటికీ స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం

- రూ.50కోట్ల పైగా బకాయిలు
- ఉపకార వేతనాల మంజూరులోనూ అదే జాప్యం
- కళాశాలల నుంచి విద్యార్థులకు ఒత్తిళ్లు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- గతంలో ఏటా నాలుగు విడతల్లో అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఫీజుల కింద రూ.466.74కోట్లు జమ చేసిన జగనన్న



సాక్షి, మచిలీపట్నం: ఉన్నత విద్య చదివే విద్యార్థుల్లో ఫీజు పరేషాన్ మొదలైంది. రాష్ట్రప్రభుత్వం ఉపకార వేతనాలు, ఫీజులను సకాలంలో మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలకు పేర్లు మార్చిన కూటమి ప్రభుత్వం, లబ్ధిదారులకు మాత్రం ఆయా పథకాలను అందించడం లేదు. అందులో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఒకటి. గత ఐదేళ్లుగా నిరాటంకంగా అందిన ఫీజు రీయింబర్స్‌మెంటు నిధు లను సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఫీజు చెల్లించలేక..సర్టిఫికెట్లు అందక..

2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ ఏడాది మార్చి ఒకటో తేదీన అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృష్ణా జిల్లాలోని 32,260మంది విద్యార్థులకు రూ.28.03కోట్లు విడుదల చేసింది. ఈ నిధులను నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేసింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరంలో జూన్, ఆగస్టు, నవంబర్ మాసాలకు సంబంధించి మూడు విడతలుగా విడుదల చేయాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల ఊసే మరిచింది. దీంతో రూ.50కోట్ల వరకు బకాయిలు విద్యార్థులకు అందాల్సి ఉంది. అదేవిధంగా జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు ఫీజురీయింబర్స్‌మెంటు కోసం 26,321 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈప్రక్రియ కొనసాగుతోంది. అయితే జూన్ నుంచి ఇప్పటివరకు మూడు విడతలుగా ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవుతున్నారు. సెమిస్టర్ పరీక్ష రాయాలంటే ఫీజు కడితేనే హాల్ టికెట్లు ఇస్తామని, కోర్సు పూర్తయిన విద్యార్థులు బకాయి ఫీజును చెల్లిస్తేనే సర్టిఫికెట్లు అందజేస్తామంటూ పలు కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. దీంతో చెల్లించే స్థోమత లేక, సర్టిఫికెట్లు పొందలేక, పైచదువులకు వెళ్లలేక పేద విద్యార్థులు అవస్థలుపడుతున్నారు.

సంక్షేమ శాఖల వారీగా విద్యార్థుల వివరాలు

వెల్ఫేర్ శాఖ	2023–24 విద్యార్థుల సంఖ్య	విడత–1 జమ అయిన సొమ్ము (రూ.కోట్లు)	రెన్యూవల్ విద్యార్థులు	2024–25 కొత్త రిజిస్ట్రేషన్లు
ఎస్సీ వెల్ఫేర్	7590	6.26	7605	5276
ఎస్టీ వెల్ఫేర్	471	0.36	909	596
బీసీ వెల్ఫేర్	14579	12.63	16615	12212
ఈబీసీ	2321	2.31	3769	2779
కాపు	5259	4.65	5118	3766
మైనారిటీ	2102	1.81	2054	1520
క్రిష్టియన్ మైనారిటీ	298	0.28	277	172
మొత్తం	32620	28.03 కోట్లు	36347	26321

ఐదేళ్లలో రూ.466.74 కోట్లు విడుదల..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తమ పాలనలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన కింద రూ.466.74 కోట్లను విడుదల చేసింది. ఈ నిధులను 2,65,045 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసింది. వీటితోపాటు 2017–18, 2018–19లో చంద్రబాబు సర్కారు పెండింగ్‌లో పెట్టిన బకాయిలను సైతం విద్యార్థులకు అందించి వారిని ఆదుకుంది. కుటుంబ వార్షిక ఆదాయాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.లక్షగా నిర్దేశిస్తే, ఎక్కువమందికి ప్రయోజనం చేకూరాలనే ఉద్దేశ్యంలో జగన్ ప్రభుత్వం ఆదాయం పరిమితిని రూ.2.50 లక్షలకు పెంచింది. ఇలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని లక్షలాదిమంది విద్యార్థులకు వందలాది కోట్లను అందించి వారి అభ్యున్నతికి కృషిచేయగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల చేయకుండా మిన్నకుంటుండటంతో పేదల చదువులకు పెద్దగండమే ఏర్పడినట్లయింది.

ఫీజులు మంజూరు చేసి ఆదుకోవాలి..



ప్రభుత్వం ఫీజులు విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యం పదేపదే అడుగుతోంది. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ కావడంతో సెమిస్టర్ పరీక్షలకు ఇబ్బంది అవుతుందేమో అనే ఆందోళనగా ఉంది. వెంటనే ఫీజురీయింబర్స్‌మెంట్ మంజూరు చేసి ఆదుకోవాలి.

– ఎస్.ఎల్. విశల్, బీటెక్ ఫైనల్ ఇయర్, పెడన.

తల్లికి వందనం కాదు.. ఊరూరా మద్యం



విద్యా దీవెన, వసతి దీవెన ఫీజులు మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తల్లికి వందనం అని గత ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ విషయాన్ని విస్మరించి, ఊరూరా మద్యం షాపులు ఏర్పాటు చేసింది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఆయా నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి.

– ఎండి. సాధిక్ బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి.

దీవెన..ఆవేదన..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి 'జగనన్న విద్యాదీవెన', 'జగనన్న వసతి దీవెన' పేరుతో విద్యార్థులకు ఆర్థికంగా అండగా నిలిచింది. ఏటా జూన్ మాసంలో విద్యా దీవెన నిధులు విడుదల చేసింది. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పథకాల పేర్లు మార్చడం వరకు పరిమితమైంది తప్ప అమలుపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. సజావుగా అమలవుతున్న పథకాలకు పేర్లు మార్చడంపై ఉన్న శ్రద్ధ నిధులు విడుదల చేయడంలో లేకపోవడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు.

భూముల రీసర్వేపై కలెక్టర్ సమీక్ష



భూముల రీసర్వే ప్రక్రియపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో భూముల రీసర్వే ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ డీకె బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆర్డీవోలు, సర్వేశాఖ అధికారులతో గురువారం ఆయన రీసర్వే నిర్వహణపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో భూముల రీసర్వే ప్రారంభించనున్న నేపథ్యంలో సమగ్ర రీసర్వే చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రీసర్వేను తూతూమంత్రంగా చేస్తే కుదరదని, ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా కచ్చితత్వంతో నిర్వహించాలన్నారు. రీసర్వే కోసం వచ్చే వారం తహసీల్దార్లు, డీటీ, సర్వేయర్లతో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి భూమికి ప్రత్యేక ఎల్‌పీఎం నంబరు ఇవ్వాలని, యజమాని పేరు రెవెన్యూ రికార్డుల్లో రావాలని సూచించారు. రీసర్వేలో తొలుత నిర్వహించే ప్రీ డ్రోన్ ఫ్లయింగ్ ప్రతి గ్రామంలో దాదాపుగా ఇప్పటికే పూర్తయ్యాయని, గ్రౌండ్ ట్రూతింగ్, డిజిటల్ మ్యాప్, చెక్‌లిస్ట్ ఆధారంగా భూమిపై నిజనిర్ధారణ చేయాలన్నారు. వెబ్‌ల్యాండ్, ఎఫ్ఎంబీలో వివరాలు విస్తీర్ణం సరిపోలాలన్నారు. గ్రామాల్లో ఉదయం వేళల్లో భూముల రీసర్వే చేపట్టాలని, గ్రౌండ్ ట్రూతింగ్‌కు ముందుగా గ్రామ సభ నిర్వహించాలన్నారు. ప్రతిరోజు క్షేత్రస్థాయిలో చేసిన పనిని అదేరోజు కంప్యూటర్లలో నమోదు చేస్తే రీసర్వే సులువుగా పూర్తవుతుందన్నారు. తహసీల్దార్, మండల సర్వేయర్, డీటీలు సమావేశమై రీసర్వే ప్రక్రియపై సమీక్షించుకోవాలన్నారు. కుటుంబ సభ్యుల మధ్య ఆస్తులు పంచుకునే వారు, సబ్ డివిజన్ చేసుకోవాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా ఉంటుందన్నారు. సర్వే పనుల రోజువారీ పర్యవేక్షణ కోసం ఆర్డీవో, జిల్లా సర్వే ల్యాండ్ అధికారి కార్యాలయంలో పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, కెఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవోలు కె.స్వాతి, బీఎస్ హేళాషారోన్, బాలసుబ్రహ్మణ్యం, జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అధికారి జోషీలా తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా ఆశలపై నీళ్లు!

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణాడెల్టా పరిధిలోని రైతులు రబీ పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని కలెక్టర్ డీకె బాలాజీ గురువారం ప్రకటించారు. ఈ ఏడాది ఇప్పటివరకు కృష్ణా నదిలో ఎప్పుడూ రానివిధంగా వరద ప్రవాహం ఉన్నందున శ్రీశైలం, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజీ ద్వారా ఖరీఫ్ పంటకు సమృద్ధిగా 290 టీఎంసీల నీటిని సరఫరా చేశామన్నారు. గతనెల నుంచి కృష్ణానదిలో నీటిలభ్యత తగ్గిపోగా, ప్రస్తుతం జలశయాల్లో నిల్వ ఉన్న నీటిలో 167 టీఎంసీలను సాగులో ఉన్న ఖరీఫ్ పంటలకు సరఫరా చేయాల్సి ఉందన్నారు. 2025 జూన్ నెలాఖరు వరకు తాగునీటి కోసం 22టీఎంసీలతో కలిపి 185 టీఎంసీలు అవసరమవుతాయని పేర్కొన్నారు. పులిచింతల్లో ఇప్పుడున్న నీటి నిల్వ పరిమాణం 39 టీఎంసీలను తాగునీటికి, రాబోయే ఖరీఫ్ పంటకు ముందస్తుగా జూన్ నెలలోనే సరఫరా చేసేందుకు నిల్వ చేయాల్సి ఉంది. ఇందుకోసం రబీ పంటకు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు అవకాశం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈనేపథ్యంలో ఆరుతడి పంటలను మాత్రమే వేసుకోవాలని రైతులకు సూచించారు.

హవ్వ.. నవ్విపోదురు గాక!

- ఎంఎంసీలో తాగునీటికి కటకట
- 12 రోజులుగా సిబ్బంది ఇబ్బందులు
- మరమ్మతుకు నోచని ఆర్వో ప్లాంట్
- మరుగుదొడ్లు శుభ్రం చేసి రెండు నెలలు



మరమ్మతులకు నోచుకోని ఎంఎంసీ కార్యాలయంలోని ఆర్వో ప్లాంట్

మచిలీపట్నంటౌన్: బందరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది ఎదుర్కొంటున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గుక్కెడు నీళ్ల గత 12 రోజులుగా లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయంలోని ఆర్వో ప్లాంట్ చిన్నపాటి మరమ్మతుకు గురై 12 రోజులైనా దీన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో కార్యాలయంలోని పలు విభాగాల సిబ్బంది కార్యాలయం పక్కనున్న దుకాణాల వద్దకు వెళ్లి తాగునీరు తెచుకుంటున్నారంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఓ విభాగానికి చెందిన సిబ్బంది ఖాళీ బాటిళ్లతో తాగునీటి కోసం మరో విభాగానికి వెళ్లి అడుగుతుండటంతో మాదీ మీ పరిస్థితేననే సమాధానంతో నిరాశతో వెనుతిరిగి బయటకు వెళ్లి తెచ్చుకుంటున్నారు.

దుర్వాసన

ఇదిలా ఉంటే కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది వినియోగించే మరుగుదొడ్లు, యూరినల్ విభాగాలు అధ్వానంగా కనిపిస్తున్నాయి. మరుగుదొడ్లు దుర్వాసన వస్తుండటంతో వీటిని వినియోగించే సాహసం ఉద్యోగులు చేయటం లేదు. మరుగుదొడ్లు శుభ్రం చేసి రెండు నెలలైనా అధికారులు సమస్యను పరిష్కరించకుండా మిన్నకుండటంతో ముఖ్యంగా కార్యాలయంలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. కొంత మంది పురుష ఉద్యోగులు అత్యవసరమైతే సమీపాన ఉన్న సినిమా హాళ్లలోని టాయిలెట్స్‌ను వినియోగించేందుకు వెళుతున్న పరిస్థితి ఇక్కడ నెలకొంది. కార్యాలయంలోని మరుగుదొడ్లను శుభ్రం చేసే ఉద్యోగిని రెండు నెలల క్రితం డివిజన్లలో పారిశుద్ధ్య పనులకు వినియోగిస్తుండటంతో సమస్య మొదలైంది. పురుషుల యూరినల్స్ విభాగమైతే మరీ గబ్బు పట్టి, మరమ్మతులకు గురై ఉన్నాయి. యూరినల్స్ సింక్‌లు పగిలిపోయి, నీటి సరఫరా లేక దుర్వాసన వస్తోంది. కొంతమంది ఉద్యోగులు ఆ పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని వినియోగిస్తుండటంతో ఆ ప్రాంత మంతా దుర్వాసన వెదజల్లుతోంది.



అధ్వానంగా టాయిలెట్లు

వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేదు

ఈ సమస్యల పరిష్కారానికి ఇటీవల కమిషనర్ బాపిరాజుకు వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేకపోయిందని ఉద్యోగులు వాపోతున్నారు. ఆస్తి, ఖాళీ స్థలాలు, తాగునీటి పన్నులు చెల్లించే నగర వాసులకు రూ. రెండు లక్షల వ్యయంతో ప్రోత్సాహక బహుమతులు ఇచ్చేందుకు కౌన్సిల్ అజెండాలో పెట్టిన అంశాన్ని పాలకవర్గం ఇటీవల జరిగిన సమావేశంలో తిరస్కరించింది. ఈ నిధులతో ముందు ఎంఎంసీ కార్యాలయంలోని ఉద్యోగుల తాగునీటి ఇబ్బంది, మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలని అధికార వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు కమిషనర్ బాపిరాజుకు సూచించారు. కానీ ఇది ఆచరణలో పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

విచ్చలవిడి.. ఇసుక దోపిడీ

రీచ్‌ల నుంచే యథేచ్ఛగా తెలంగాణకు తరలుతున్న ఇసుక

- సీసీ కెమెరాలు, డ్రోన్‌లు నామమాత్రమే
- యంత్రాలతో సాగుతున్న ఇసుక తవ్వకాలు ..
- కూలీలకు లభించని ఉపాధి
- అనుమతులు లేనిచోట కూడా తవ్వకాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



చల్లపల్లి మండలం నిమ్మగడ్డలో వీఆర్‌ఏ అడ్డుకున్నా..ఆగకుండా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో 15, కృష్ణాజిల్లాలో ఎనిమిది ఇసుక రీచ్‌లకు అధికారికంగా అనుమతులు ఇచ్చారు. యంత్రాలతో కాకుండా కూలీలతోనే ఇసుక తవ్వకాలు చేపట్టాలి. కూలీలతో ఇసుక తవ్వకాలు జరిపేందుకు ప్రభుత్వం గరిష్టంగా టన్నుకు రూ.120 ధర నిర్ణయించింది. అయితే కాంట్రాక్టర్లు ఇసుక రీచ్ తమ అధీనంలో ఉంటే చాలు అక్రమంగా ఇసుక రవాణాచేసి భారీఎత్తున దండుకోవచ్చన్న భావనతో ఎన్టీఆర్ జిల్లాలో టన్నుకు గరిష్టంగా రూ.80, కృష్ణాజిల్లాలో అతి తక్కువగా టన్నుకు కేవలం రూ.19కే కోట్ చేసి, ఇసుక లోడింగ్ టెండర్లను దక్కించుకొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పెండ్యాల, కొక్కునూరు, అనుమంచిపల్లి, శనగపాడు రీచ్‌లో ఇసుక తవ్వకాలు ప్రారంభం కాగా, ఇక్కడ కూలీలతో ఇసుక లోడింగ్ చేయించడం లేదు. హైదారాబాద్‌తోపాటు తెలంగాణలో ఈ ప్రాంత ఇసుకకు డిమాండ్ ఉండటంతో రీచ్‌లనుంచే నేరుగా హైదరాబాద్‌కు ఇసుకను తరలించి భారీగా దండుకొంటున్నారు. ఇసుక అక్రమరవాణాలో నేరుగా ప్రజాప్రతినిధుల హస్తం ఉండటంతో అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

బాబు మాటలకు అర్థాలే వేరులే..

ఇసుకను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకొంటామంటూ సీఎం చంద్రబాబు చేస్తున్న హెచ్చరికలను కాంట్రాక్టర్లు పెడచెవిన పెడుతున్నారు. బాబు మాటలకు అర్థాలే వేరులే అని ప్రజాప్రతినిధులే బహిరంగంగా పేర్కొంటుండటం అనుమానాలకు తావిస్తోంది. రీచ్‌లు, స్టాక్ పాయింట్లలోని కెమెరాలు అలంకారప్రాయంగా మారగా, డ్రోన్లతో పర్యవేక్షణ చేస్తున్నామని పోలీసులు చెబుతున్నప్పటికీ అదికూడా మాటలకే పరిమితమైంది. మున్నేరు, తిరువూరు ప్రాంతాల నుంచి ఇసుక నిత్యం తెలంగాణకు తరలివెళ్తూనే ఉంది.

పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా...

కృష్ణాజిల్లాలో ఎనిమిది రీచ్‌లలో తవ్వకాలకు అనుమతి ఇవ్వగా, రీచ్‌లలో నీరు ఉండటంతో ఇప్పటివరకు శ్రీకాకుళం ఇసుక రీచ్ మాత్రమే ప్రారంభమైంది. ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వకపోయినప్పటికీ పెనమలూరు, పామర్రు, అవనిగడ్డ, చోడవరం ప్రాంతంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. చోడవరంలో రోజుకు 170 ట్రాక్టర్లతో వందలాది ట్రిప్పుల ఇసుక బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోతుంది. టీడీపీ నేతలు మూడు ర్యాంప్‌లు ఏర్పాటు చేసి, రోజుకు రూ.2 లక్షల వరకు వసూళ్లు చేస్తున్నారు. ఇక్కడ సుప్రీంకోర్టు ఆదేశాలను అధికారులు తుంగలో తొక్కుతున్నారు. టీడీపీ నేతలు ట్రాక్టర్ డ్రైవర్లపై దాడులు చేయగా బాధితుల నుంచి ఫిర్యాదులు అందినా పోలీసులు దగ్గర ఉండి రాజీచేసి పంపారు.

అవనిగడ్డలో ఆగని దందా...

అవనిగడ్డ నియోజకవర్గంలో ఘంటసాల మండలం శ్రీకాకుళంలో రెండుచోట్ల ఇసుక క్వారీలకు ప్రభుత్వం అనుమతివ్వగా మూడు రోజుల క్రితమే తవ్వకాలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలోని మిగిలిన ప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. సహజ వనరులను దోచుకుంటే ఎవరినీ ఉపేక్షించేది లేదని అలాంటివారు మాపార్టీ వారైనా వారిపై కేసులు పెట్టాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వేదికల మీద చెబుతున్నారు. కానీ అందుకు భిన్నంగా రాత్రివేళలో సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్న దివిసీమలోని సాగునీటిని ప్రధాన ఆధారమైన పులిగడ్డ అక్విడెక్టుకు కూతవేటు దూరంలో ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ, మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాల వరకూ కృష్ణానదికి ఆనుకుని ఉన్న ప్రతిగ్రామంలో అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. చల్లపల్లి మండలం నిమ్మగడ్డ, వెలివోలు, ఆముదార్లంక, ఘంటసాల మండలం పాపవినాశనం మోపిదేవి మండలం కె.కొత్తపాలెం, పెదకళ్లేపల్లి, నాగాయతిప్ప, అవనిగడ్డ మండలం పులిగడ్డ, దక్షిణ చిరువోలులంక, కోడూరు మండలం విశ్వనాధపల్లి, కుమ్మరిపాలెం, నాగాయలంక మండలం టి.కొత్తపాలెం, నాగాయలంక, మనుషులతో కాకుండా ప్రొక్లెయిన్ల ద్వారా ట్రాక్టర్లలోకి లోడు చేసుకుని తరలించేస్తున్నారు. చల్లపల్లి మండలంలో ఇసుక అక్రమరవాణాని అడ్డుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, జర్నలిస్ట్‌లపై అక్రమ ఇసుకదందా చేస్తున్న వారు దాడులకు తెగబడుతున్నారు. వీరి ఆగడాలకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగం భయపడిపోతుండటం గమనార్హం.

పామర్రులో అడిగేవారేరి...!

పామర్రు నియోజకవర్గంలోని భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, కళ్లావారిపాలెం తదితర ప్రాంతాలకు ఇసుక అక్రమ రవాణాకు ప్రధాన కేంద్రాలుగా మారాయి. ఒక్కొక్క ప్రాంతనుంచి రోజుకు 400 ట్రాక్టర్లకుపైగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అక్కడ ర్యాంపు పేరుతో తెలుగుతమ్ముళ్లు ట్రాక్టరుకు రూ.200 ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. అనుమతి లేకున్నా నదిలో అక్రమంగా ఇసుక తవ్వుతున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు.

క్లుప్తంగా

24న జిల్లా స్థాయి క్యారమ్స్ పోటీలు

విజయవాడస్పోర్ట్స్: జిల్లా స్థాయి క్యారమ్స్ పోటీలను విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా క్యారమ్స్ సంఘం కార్యదర్శి జె.మురళీకృష్ణ గురువారం తెలిపారు. సీనియర్, వెటరన్ స్త్రీ, పురుషుల సింగిల్స్ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తామన్నారు. 50 ఏళ్ల వయసు పైబడిన వారు మాత్రమే వెటరన్ విభాగ పోటీలకు అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 23వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా 91774 79119 నంబర్‌లో సంప్రదించి ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల అనంతరం రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్లను ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు బి.వెంకయ్య 94921 21727, షేక్ అజ్మతుల్లా 94911 22634 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

టైరు పేలి 104 అంబులెన్స్ బోల్తా



ఉంగుటూరు: టైరు పేలి 104 అంబులెన్స్ బోల్తాపడిన సంఘటన ఉంగుటూరు మండలం ఇందుపల్లి శివారు వెంకట్రామపురం వద్ద గురువారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం ఇందుపల్లి పీహెచ్‌సీకి చెందిన 104 అంబులెన్స్(సంచార వైద్య కేంద్రం) తేలప్రోలు నుంచి ఇందుపల్లి వెళ్తుండగా వెంకట్రామపురం వద్ద టైర్ పేలి బోల్తాపడింది. అంబులెన్స్‌లో ఉన్న డ్రైవర్ గంధం గిరిపవన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కె.నాగలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై ఉంగుటూరు ఎస్‌ఐ గోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యార్డుకు 46,017 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 46,017 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 44,282 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 37,373 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

అగమ్యగోచరం..

‘అంగన్‌వాడీ’ల నిర్మాణం

- నత్తనడకన సాగుతున్న భవన నిర్మాణ పనులు
- జిల్లాలో రూ.8.90 కోట్లతో 87 భవనాల నిర్మాణం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే రూ.5.18 కోట్ల మంజూరు
- త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్న తల్లిదండ్రులు



నిలిచిన వడ్లమన్నాడు అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు



అసంపూర్తిగా ఉన్న దోకిపర్రు అంగన్‌వాడీ భవనం

గుడ్లవల్లేరు: కృష్ణాజిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో మొత్తం 1,707 కేంద్రాలు ఉన్నాయి. అందులో రూ.8.90 కోట్ల ప్రభుత్వ నిధులతో 87 భవనాల నిర్మాణం జరుగుతోంది. నాడు – నేడు పథకం కింద వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యధిక వాటా రూ.5.18 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే 686 అంగన్‌వాడీలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అందులో అద్దె చెల్లించే 453 కేంద్రాలు, అద్దె లేని 233 అంగన్‌వాడీలను నిర్వహిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక నిర్మిస్తున్న కొద్దిపాటి భవనాలకు కూడా బిల్లులు చెల్లించక పోవటంతో నిర్వాహకులు పూర్తి చేయలేక చేతులెత్తేస్తున్నారు.

బిల్లులు చెల్లించని కూటమి ప్రభుత్వం

మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద 45 భవనాల్లో ఒక్కో భవనానికి రూ.7 లక్షల చొప్పున రూ.3.15 కోట్లతో నిర్మిస్తున్నారు. ఆర్‌ఐడీఎఫ్ కింద ఐదు భవనాలను ఒక్కో భవనాన్ని రూ.11.50 లక్షల చొప్పున రూ.57.50 లక్షలతో నిర్మాణాల పనులను నిర్వహిస్తున్నారు. అలాగే వైఎస్సార్ సీపీ హయాంలో నాడు – నేడు పథకం కింద రెండు విడతలుగా మంజూరు చేసిన 37 నిర్మాణాలను ఒక్కో భవనాన్ని రూ.14లక్షల చొప్పున రూ.5.18 కోట్లతో నిర్మిస్తున్నారు. నిధులను మంజూరు చేసినా ఈ నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం సరిగా బిల్లులు చెల్లించకపోవటంతో పనుల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లాలోని 87 భవనాలను వెంటనే నిర్మించి అంగన్‌వాడీ కేంద్రాలకు అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వ నిధుల వెసులుబాటును బట్టి త్వరితగతిన అంగన్‌వాడీ నిర్మాణాలను పూర్తి చేసే విధంగా ఇంజినీరింగ్ శాఖ ద్వారా చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.సువర్ణ వివరణ ఇచ్చారు.

నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి..



పేద చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు అందించాలంటే చాలా ప్రాంతాల్లో సరైన వేదిక లేదు. కొత్తగా నిర్మిస్తున్న భవనాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. భవనాలు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు.

– జాలీ, ఏఐఎస్‌ఎఫ్ మచిలీపట్నం టౌన్ సెక్రటరీ

గత ప్రభుత్వంపై సాధింపు వద్దు..



అంగన్‌వాడీల్లో చిన్నారుల కోసం కొత్తగా నిర్మిస్తున్న భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలి. అంతేగానీ గత ప్రభుత్వంపై కక్ష సాధించేందుకు ఆ హయాంలో నిధులు మంజూరయ్యాయని బిల్లులు విడుదల చేయకపోతే పేద చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడతారు.

– ఎం.సాయికుమార్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కోశాధికారి

గ్రామాల్లో వసతులకు కేంద్రం నిధుల కేటాయింపు



పరిటాల(కంచికచర్ల): గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్లు గ్రామ పంచాయతీ ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి ప్రణాళిక(జీపీఎస్‌డీపీ) రాష్ట్ర కో ఆర్డినేటర్ శ్రీనాథ్ నైనీ పేర్కొన్నారు. కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో సమస్యలను తెలుసుకునేందుకు గురువారం డ్రోన్ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో రహదారుల అభివృద్ధి, అవసరమైన చోట్ల సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం, తాగునీటి సరఫరా చేసేందుకు డ్రోన్‌తో పనులు గుర్తిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని 29 రాష్ట్రాల్లో 34 గ్రామ పంచాయతీలను గుర్తించి వాటిలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గ్రామంలో మూడు రోజుల పాటు డ్రోన్ సర్వే జరుగుతుందని, నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ కమిషనర్ వినోద్‌కుమార్నుల్, జిల్లా పంచాయతీ అధికారి పి.లావణ్యకుమారి, ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వి.సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

నయనానందకరం.. నృత్యరూపకం



కూచిపూడిలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేనేజర్ పరమేష్, నాట్యాచార్యులు



నృత్యం చేస్తున్న కళాకారులు

కూచిపూడి(మొవ్వ): ప్రముఖ నాట్య క్షేత్రం కూచిపూడిలో గురువారం పద్మభూషణ్ వెంపటి చిన సత్యం శిష్యురాలు డాక్టర్ శుభ మరువాడ (అమెరికా) శిష్య బృందం ప్రదర్శించిన శ్రీకృష్ణ పారిజాతం కూచిపూడి నృత్య రూపకం నయనానందకరంగా సాగింది. వేదాంతం రాధేశ్యాం కూచిపూడి నాట్య శిల్పా రామం కూచిపూడి ఆధ్వర్యంలో శ్రీ సిద్ధేంద్రయోగి కళావేదికపై జరిగిన నృత్య రూపకాన్ని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీతలు వేదాంతం రాధేశ్యాం, పసుమర్తి రత్తయ్య శర్మ, డాక్టర్ చింత రవి బాలకృష్ణ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెదపూడి బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ పరమేష్, డాక్టర్ శుభ మరువాడలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

కళాకారులకు, అతిథులకు సత్కారం..

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కూచిపూడి నాట్యం నేడు ప్రపంచం నలుమూలలా విరజిల్లుతుందన్నా.. నాట్యం నమ్ముకున్న కళాకారులకు నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్తున్నాయన్నా.. పద్మభూషణ్ వెంపటి చినసత్యమే కారణమన్నారు. శ్రీ కృష్ణునిగా ప్రణూషా కారెడ్డి, సత్యభామగా అంబికా శ్రీ సిద్ధాబత్తుల, రుక్మిణిగా ప్రణవి యెర్రమరెడ్డి, నారదునిగా సంధ్య పిరాట్ల చక్కటి హావభావాలతో అందెల సవ్వడులతో నృత్య రూపకానికి జీవం పోశారు. డాక్టర్ శుభ మరువాడ(అమెరికా) నృత్య దర్శకత్వం, నట్టువాంగంలో ఆమె శిష్యులు చేసిన నృత్య రూపకానికి గాత్రం ద్వారా సీహెచ్ సుధా శ్రీనివాస్, కౌశిక్ కల్యాణ్, మృదంగంపై గణేష్ రావు, వయోలిన్‌పై సీకే విజయ రఘవన్, వేణువుపై కుమార్ బాబు సహకరించి ప్రదర్శనను మరింత రక్తి కట్టించారు. చివరిగా నిర్వాహకులు కళాకారులను, అతిథులను ఘనంగా సత్కరించారు.

జీజీహెచ్‌లో ఆరోగ్యశ్రీ కాంట్రాక్టు మార్పు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స అందించే రోగుల డాక్యుమెంటేషన్ చేసే కాంట్రాక్టును మార్పు చేసింది. ఇప్పటి వరకు విజయవాడ, గుంటూరు ఆస్పత్రుల్లో కార్వే ట్రస్ట్ డాక్యుమెంటేషన్ చేస్తుండగా, వారి కాంట్రాక్టు గడువు ముగియడంతో బుధవారం సాయంత్రంతో వారి సేవలను నిలిపివేశారు. తాజాగా గుంటూరు, విజయవాడ, కాకినాడ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ రోగుల డాక్యుమెంటేషన్ పనులు కొత్త సంస్థకు అప్పగించారు. ఇప్పటి వరకూ ఒక్కో రోగి డాక్యుమెంటేషన్ చేసినందుకు రూ.800లు చెల్లించారు. ఇలా ప్రభుత్వాస్పత్రిలో ప్రతి నెలా రెండు వేలకు పైగా రోగులు ఆరోగ్యశ్రీలో చికిత్స పొందుతుంటారు. రోగికి సంబంధించి పూర్తి డాక్యుమెంటేషన్ పూర్తి చేసి, డబ్బులు ఆస్పత్రి అకౌంట్‌లో పడిన తర్వాతనే కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇచ్చేవారు. అయినప్పటికీ అధిక వ్యయం చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం డేటా ఎంట్రీ ఆపరేటర్ల లెక్కన కాంట్రాక్టు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఎంత మంది డీఈఓలు పనిచేస్తే వారికి నిర్దేశించిన జీతం ప్రభుత్వాస్పత్రి నుంచి చెల్లిస్తారు. కొత్తగా దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ ఫర్నిచర్, కంప్యూటర్లను సిద్ధం చేస్తుంది. అవి మళ్లీ ట్రాక్‌లో పడేందుకు రెండు, మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ఆరోగ్యశ్రీ కేసుల డాక్యుమెంటేషన్ ఆలస్యం అయినా రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, సేవల్లో జాప్యం జరిగే అవకాశమే లేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.వేంకటేశ్వరరావు తెలిపారు.

కలెక్టరేట్‌లో మరమ్మతులను పూర్తి చేయాలి

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



అధికారులతో మాట్లాడుతున్న కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌లో మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో గురువారం మరమ్మతులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. కలెక్టరేట్ చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తయినప్పటికీ వాటికి రంగులతో పాటు చిన్న, చిన్న పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రహరీ బయట చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, వర్షపునీరు కలెక్టరేట్ నుంచి బయటకు వెళ్లేందుకు మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

జిల్లా ఖనిజాల ట్రస్ట్ నుంచి చెల్లింపులు

కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి చెల్లింపు – వినియోగం పద్ధతిలో నిర్వహించాలన్నారు. ఖజానా స్ట్రాంగ్‌రూమ్ పైకప్పు పనులు సత్వరమే పూర్తి చేయాలని చెప్పారు. వర్షం కురిసినప్పుడు కలెక్టరేట్ పైకప్పు నుంచి నీరు కారకుండా ఏర్పాటు చేసేందుకు అంచనాలు రూపొందించాలన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను జిల్లా ఖనిజాల ట్రస్ట్ నిధుల నుంచి చెల్లింపులు చేయాలన్నారు. ఎన్నికల విభాగం పైభాగాన, కలెక్టర్ చాంబర్ ఎదురుగా ఏర్పాటు చేసిన టైల్స్ పరిస్థితిపై నివేదిక అందజేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఎంయూడీఏ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ పద్మావతి, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేష్, పంచాయతీరాజ్ ఈఈ సుధాకర్‌గౌడ్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈడీ కృష్ణారాయన్, కలెక్టరేట్ ఏఓ సీహెచ్ వీరాంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

రెండో విడత బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కృష్ణా జిల్లా జేసీ గీతాంజలిశర్మ, అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రెండో విడత బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలను పశువుల యజమానులు తమ పశువులకు తప్పనిసరిగా వేయించాలని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ చెప్పారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాల అవగాహనపై ముద్రించిన వాల్‌పోస్టర్లను గురువారం ఆమె చాంబర్‌లో ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ.. బ్రూసెల్లా అబర్టీస్ అనే సూక్ష్మజీవి వల్ల గేదెలు, ఆవుల్లో వ్యాపించి గర్భస్రావం జరుగుతుందన్నారు. ఈ వ్యాధి గర్భస్రావాల ద్వారా మనుషులకు వ్యాప్తి చెందే జనటిక్ వ్యాధి అని, ఈ వ్యాధిని నిరోధించేందుకు నాలుగు నెలల నుంచి ఎనిమిది నెలల వయసున్న పెయ్యదూడలకు ఈ టీకాను వేయాలన్నారు. బ్రూసెల్లా ముఖ్యమైన వ్యాధి కావటంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ పశువ్యాధి నిరోధక పథకం(ఎన్‌ఏడీసీపీ) ద్వారా సామూహిక టీకా కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. పశుసంవర్ధకశాఖ సిబ్బంది ప్రతి గ్రామంలో టీకాలు మూడు దఫాలుగా వేస్తారన్నారు. ఈ నెల 20 నుంచి డిసెంబర్ 19వ తేదీ వరకు 9 వేల పెయ్యదూడలకు ఈ టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎన్‌సీహెచ్ నరసింహులు, డీఎస్‌వో వి.పార్వతి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ డి.సృజన, సిబ్బంది పాల్గొన్నారు.

నడిరోడ్డుపై కుప్పకూలి పశ్చిమ బెంగాల్ యువకుడి మృతి



గన్నవరం: నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడు ఒక్కసారిగా నడిరోడ్డుపై కుప్పకూలి మృతి చెందిన సంఘటన స్థానిక రాయ్‌నగర్ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం.. పశ్చిమబెంగాల్‌లోని సౌత్ 24 పరగణాస్ ప్రాంతానికి చెందిన సలావుద్దీన్ లస్కర్(34) మగ్గం పనుల నిమిత్తం ఇటీవల గన్నవరం వచ్చాడు. స్థానిక రాయ్‌నగర్ కాలనీలోని మరి కొంత మంది యువకులతో కలిసి ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో మూడు రోజుల నుంచి తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న అతను ఇంటికి వెళ్లేందుకు బయలుదేరాడు. స్థానిక రాయ్‌నగర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న లస్కర్ ఒక్కసారిగా కుప్పకూలిపడిపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి అతనికి సీఆర్పీ చేసినప్పటికీ ఎటువంటి కదలిక లేకపోవడంతో 108కు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది అతనిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లుగా గుర్తించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రాజకీయ వ్యవస్థలో పోలీసుల భాగస్వామ్యం తగదు

దేవినేని అవినాష్



నందిగామ సబ్‌జైలు వద్ద మాట్లాడుతున్న అవినాష్, డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, నాయకులు

నందిగామటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పోలీసులను పార్టీ నాయకులు, కార్యకర్తల్లా ఉపయోగించుకుంటోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ దేవినేని అవినాష్ అభ్యంతరం వ్యక్తం చేశారు. నందిగామ సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, జగ్గయ్యపేట సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి చిన్నాలతో కలిసి గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా సబ్‌జైలు వద్ద అవినాష్ విలేకరులతో మాట్లాడుతూ కారు ఎదురుపడిందనే ఘటనను ఆసరాగా చేసుకుని దాడికి పాల్పడిన వారిపై 324 కేసుకట్టి, దాడికి గురైన వారిపై హత్యాయత్నం కింద కేసు కట్టి ఏడుగురిని రిమాండ్‌కు తరలించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మైనర్‌లు, విద్యార్థులు అనే తేడా లేకుండా చివరకు వివాహ కార్యక్రమానికి వచ్చిన వారిపై కూ డా పోలీసులు కేసు నమోదు చేస్తుండటం బాధాకరమని పేర్కొన్నారు. బాధితులకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

తీరు మార్చుకోవాలి..

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు మాట్లాడుతూ న్యాయం పక్షాన నిలిచి బాధితులకు అండగా ఉండాల్సిన పోలీసులు సైతం రాజకీయ వ్యవస్థలో భాగమవడం బాధాకరమన్నారు. కేసుతో సంబంధం లేనివారి సమాచారం అడుగుతూ మహిళలను పోలీసులు బెదిరించడం మంచి పద్ధతి కాదన్నారు. పోలీసు చర్యలు రాజకీయ కక్ష సాధింపు చర్యలను ప్రోత్సహించేలా ఉంటుండటంతో పోలీసులపై ప్రజలకు నమ్మకం పోతుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో సంయమనంతో ఉన్నారని వారిని అదుపు చేయలేని పరిస్థితులు కల్పించొద్దని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు తీరు మార్చుకుని నడుచుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు మహ్మద్ మస్తాన్, కన్నెకంటి జీవరత్నం, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, పాములపాటి రమేష్, షేక్ మున్నా, ముప్పాల శ్రీను, నల్లమల్లి మురళి, న్యాయవాదులు పీఎల్ నరసింహారావు, విజయ్ పాల్గొన్నారు.

సాగర తీరంలో పోలీసుల మాక్‌డ్రిల్



హంసలదీవి సాగరతీరంలో బోటుపై పరిశీలిస్తున్న సీఐ సురేష్‌రెడ్డి

కోడూరు: ఉగ్రవాదులు, తీవ్రవాదులు ఆచూకీ కనిపెట్టేందుకు హంసలదీవి సాగర తీరం వెంట పోలీసులు ప్రత్యేక మాక్‌డ్రిల్ నిర్వహించారు. కోస్టల్ అధికారుల ఆదేశాల మేరకు గురువారం తీరంలో సీ–విజిల్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా మచిలీపట్నం ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పాలకాయతిప్ప మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి పర్యవేక్షణలో 50 మంది పోలీసులు కోడూరు, నాగాయలంక మండలాల్లోని తీరప్రాంత గ్రామాల్లో పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. కోస్టల్ పోలీసులు, నేవీ అధికారులు ఉగ్రవాదులు, తీవ్రవాదుల రూపంలో వచ్చి తీరప్రాంత గ్రామాల్లోని ఏదో ఒక ప్రాంతంలో దాగుంటారని, వీరిని కనిపెట్టేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి చెప్పారు. వీరిని కనిపెట్టేందుకు పోలీసులు ప్రత్యేక పడవల ద్వారా సముద్రమార్గం వెంట సంచరించారు. సముద్రంలో వేటాడుతున్న పడవులను కూడా తనిఖీ చేశారు. పాలకాయతిప్ప, హంసలదీవి, ఉల్లిపాలెం, రామకృష్ణాపురం గ్రామాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేయడంతో పాటు అపరిచిత వ్యక్తుల వివరాలను సేకరించారు. వేటకు వెళ్లిన మత్స్యకారుల ఐడీ కార్డులను పరిశీలించడంతో పాటు వారికి కూడా అనుమానితులను గుర్తించే ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఉగ్రవాదుల రూపంలో వచ్చిన వ్యక్తిని పోలీసులు హంసలదీవి వేణుగోపాలస్వామివారి ఆలయంలో అదుపులోకి తీసుకొని మాక్‌డ్రిల్‌ను ముగించారు. ఎస్‌ఐలు, అవనిగడ్డ సబ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టెల్లాలో క్రిస్మస్ ఫెస్ట్



పటమట(విజయవాడతూర్పు): స్టెల్లా కళాశాలలో సాంస్కృతికోత్సవాలు– క్రిస్మస్ ఫెస్ట్‌లో భాగంగా గురువారం విద్యార్థులకు రంగోలి, మిస్ బ్లాక్ షో పోటీలు నిర్వహించారు. ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్థినులు సవాళ్లను అధిగమించటం ఎలా అనే అంశంపై అందమైన రంగోలిలతో ప్రతిభను చూపారు. మహిళలపై జరుగుతున్న హింసాత్మక ఘటనలు, వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, అడవులను నరికివేస్తే జరిగే పరిణామం వంటి ఎన్నో సందేశాత్మక రంగోలిలు వేశారు. అనంతరం నిర్వహించిన మిస్ బ్లాక్ షో ఆద్యంతం ఆకట్టుకుంది. మిస్ బ్లాక్ షో విజేతగా ఆషా ఎంపిక అయింది. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ స్వప్న వున్నం, అధ్యాపకులు డాక్టర్ బ్యూల, సుప్రియ, స్వరూప, శైలజ, సూరయ్య, స్వరూప్ కుమార్, శాంతిశ్రీ, మంజుల, హారిక అంజనీ సింహా పాల్గొన్నారు.